క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కోసిగి: మండలంలోని నేలకోసిగి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి తెలిపారు. సర్పంచ్ పశువుల హనుమంతమ్మతో కలిసి గురువారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వందగల్లు సచివాలయపరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కింద కేటాయించిన రూ.20లక్షల్లో రూ.10లక్షలు తాగునీటి కోసం ఉపయోగించగా, మరో రూ.10లక్షలతో నేలకోసిగిలో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఎంపీపీ ఈరన్న, పంచాయతీ రాజ్ ఏఈ యుగంధర్ రెడ్డి, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, జంపాపురం బసిరెడ్డి, కాల్వ లక్ష్మయ్య, గానిగ వీర స్వామి,నేలకోసిగి లక్ష్మన్న, వీరేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలో నెలకొన్న ప్రజా, రైతు సమస్యలు పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి భాస్కర్‌యాదవ్,మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి ముబ్బు ఆంజనేయ కోరారు.స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏఐకేఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారంలో తహసీల్దార్,సిబ్బంది విఫలమయ్యారని విమర్శించారు. సమస్య ల పరిష్కారానికి రైతులు,ప్రజలు కార్యాల యం చుట్టూ తిరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దారు వీరేంద్రగౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం ప్యాకెట్లు, నిందితుడితో పోలీసులు

కోసిగి: మండలంలోని జంపాపురం గ్రామానికి చెందిన భీముడు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. గురువారం గ్రామానికి వెళ్లి భీముడు ఇంట్లో సోదాలు చేయగా.. అమ్మకానికి తెచ్చుకుని ఇంట్లో నిల్వ ఉంచి 92 ఒరిజనల్ ఛాయిల్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు పట్టుబడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ప్రమాదాల నివారణపై అవగాహన



అంగన్‌వాడీ టీచర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆదోని అర్బన్ : పట్టణంలోని అగ్నిమాపక వారోత్సవాలు గురువారం ముగిశాయి. కార్యక్రమానికి సబ్‌జైల్ సూపరింటెండెంట్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు. ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్లకు అగ్ని ప్రమాదాలపై అధికారులు అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ అధికారి యేసురత్నం మాట్లాడుతూ ఏడు రోజుల పాటు ప్రజలు, కార్మికులకు అగ్ని ప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పించామని చెప్పారు. అనంతరం సబ్ జైలు సూపరింటెండెంట్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ మహిళలు వంట చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లీడింగ్ ఫైర్‌మెన్లు, ఆపరేటర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు

ఆదోని టౌన్ : వేసవి కాలం దృష్ట్యా పట్టణంలో తాగునీటిని వృథా చేయవద్దని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి సూచించారు. గురువారం ఎంఐజీ పంప్‌హౌస్ వద్ద వాటర్ వర్క్స్ అధికారులు, లైన్‌మెన్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పైపులైన్ల లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని, ఎస్ఎస్ ట్యాంకుల వద్ద నీటి వృథా అరికట్టాలని చెప్పారు. బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నుంచి నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

చదువు మధ్యలో ఆగిపోరాదని..

- ఇతర ప్రాంతాలకు తల్లిదండ్రుల వలస
- విద్యార్థుల కోసం సీజనల్ హాస్టళ్లు ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- మంత్రాలయం నియోజకవర్గంలో 450 విద్యార్థులకు వసతి
- తగ్గిన డ్రాప్‌అవుట్లు

సంక్రాంతి తరువాత జిల్లాలోని పశ్చిమ ప్రాంతం నుంచి పనులు లేక ప్రజలు వలస వెళ్తారు. ఈ క్రమంలో తమ పిల్లలను కూడా తీసుకెళ్లేవారు. దీంతో వారి చదువు మధ్యలోనే ఆగిపోయేది. ఇలా ఏటా ఎంతోమంది చిన్నారులు చదువుకు దూరమవుతుండటాన్ని గమనించిన ప్రభుత్వం.. పరిష్కారం చూపాలని సీజనల్ హాస్టళ్లను ప్రారంభించింది. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారి పిల్లల బాధ్యతను తీసుకుంది. చదువు చెప్పిస్తూ, భోజనం పెడుతూ ఇంటిని మరిపిస్తున్నారు.

కోసిగి: జిల్లాలో వెనుకబడిన కోసిగి మండలం నుంచి బతుకుదెరువు కోసం వందలాది కుటుంబాలు పట్టణాలకు వలటబాట పడుతున్నారు. ఒంటరి కుటుంబాలు కావడంతో పిల్లల ఆలనపాలన చూసుకునే వారు లేకపోడంతో వారిని తమతో పాటే తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో బడిని మాన్పించాల్సి వచ్చేది. ఇలా ఏటా వందల మంది బాలలు చదువు మధ్యలోనే నిలిచిపోయేది. అయితే వారి చదువు కొనసాగేలా సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసింది ప్రభుత్వం. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండలంలోని ఐరన్‌గల్లు, కందుకూరు, కోసిగిలోని ఆదిఆంధ్ర, చాకలి గేరి ప్రాథమిక పాఠశాల పరిధిలో సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేశారు. మంత్రాలయం మండలంలో మాధవరం, రచ్చుమర్రి, బూదూరు గ్రామాల్లో, కౌతాళం, పెద్దకడబూరు మండలంలోని కల్లుకుంట గ్రామంలో ఒకటి చొప్పున సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 9 సీసజల్ హాస్టళ్లు ఏర్పాటు చేసి దాదాపు 450 మంది పిల్లలు చదువు కొనసాగించేలా చర్యలు చేపట్టారు.

ఒక్కో హాస్టల్‌లో 50 మందిపిల్లలు..

వలస వెళ్లే కుటుంబాలను గుర్తించి పిల్లలను తమతో పాటు తీసుకెళ్లి జీవితాలు నాశనం చేయరాదని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడి మధ్యలో మాన్పించ కుండా ఐదో తరగతి లోపు పిల్లల సంక్షేమం కోసం హాస్టల్‌ను ఈ ఏడాది జనవరి 9 నుంచి ప్రారంభించారు. ఒక హాస్టల్‌లో 50 మంది పిల్లలు ఉండేలా ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో పిల్లలకు మెనూ ప్రకారం పాఠశాల వేళల్లో ఉదయం టిఫిన్ , సాయంకాలం అల్పాహారం, రాత్రి భోజన వసతి ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాల సెలవు దినాల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం అల్పాహారం, రాత్రి పూట ఆహారం అందిస్తున్నారు. భోజన వసతితో పాటు ఒక ట్యూటర్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉదయం, సాయంకాలం వేళల్లో విద్యను బోధిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులకు ట్యూటర్ విధానం ఎంతో దోహదపడుతోంది. హాస్టళ్లను ఈనెల ఆఖరి వరకు కొనసాగించనున్నారు. పిల్లల భవిషత్‌ను దృష్టిలో ఉంచుకుని వలస వెళ్లే కుటుంబాల పిల్లల కోసం సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కోసిగి హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు



హాస్టల్‌లో భోజనం తింటున్న విద్యార్థులు



హాస్టల్‌లో అమలయ్యే మెనూ చార్ట్

అమ్మ,నాన్న గుంటూరుకు వలస వెళ్లారు



కోసిగి ఆదిఆంధ్ర పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నా. మా అమ్మ మహాదేవి, నాన్న నాగరాజు, మూడు నెలల క్రితం గుంటూరుకు పనుల కోసం వలస వెళ్లారు. నేను కూడా వెళ్లాలనుకున్నా. కానీ సీజనల్ హాస్టల్ ఉండడంతో ఇక్కడే వదిలేసి వెళ్లారు. ఇక్కడ భోజనం పెట్టి చదువు చెబుతున్నారు. బాగా చూసుకుంటున్నారు.

– మహేశ్వరి, 5వ తరగతి విద్యార్థిని

సుగ్గికి తెలంగాణకు పోయారు



నాన్న నరసన్న, అమ్మ ఉశేనమ్మ సుగ్గికి తెలంగాణకు వెళ్లారు. నేను సీజనల్ హాస్టల్‌లో ఉంటున్నా. ఉదయం, మధ్యా హ్నం, సాయంకాలం, రాత్రి వేళల్లో భోజనం వడ్డిస్తున్నారు. పాఠశాల సమయంలో చాకలి గేరి పాఠశాల వెళ్లి హాస్టల్‌కు వచ్చి వెళ్లుతున్నా. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారు.

– నరసింహులు, కోసిగి.

డ్రాప్ అవుట్‌లు తగ్గాయి

కోసిగి మండలం నుంచి అత్యధికంగా వలసలు వెళ్తున్నారు. వారితో పాటు పిల్లలను తమ వెంట తీసుకెళ్లే వారు.ఏటా జనవరి నుంచి పిల్లలు డ్రాప్ అవుట్‌లు ఎక్కువగా ఉండేవి. ఈ ఏడాది సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయడంతో డ్రాప్ అవుట్‌లు తగ్గాయి. హాస్టల్‌లో నిబంధనలు మేరకు నాణ్యమైన విద్య అందిస్తూ మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నాం.

– మొయినుద్దీన్, ఎంఈఓ, కోసిగి

అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో కోట భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలో అమావాస్య సందర్భంగా గురువారం ఆయా వైష్ణవ, శైవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక కోట భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం,పంచామృతాభిషేకం,కుంకుమార్చన, పూలు, వెండి కవచ అలంకరణ, నైవేద్యం, మహామంగళ హారతి తదితర విశేష పూజలు చేపట్టారు.సాయంత్రం ఆలయ నిర్వాహకులు దేవిశెట్టి మంజునాథ్ ఆధ్వర్యంలో ఆలయప్రాంగణంలో రథోత్సవం జరిపించారు.

పాదయాత్ర వానదేవుడికి ఇష్టం లేనట్లుంది



మాట్లాడుతున్న బోయ శాంత

ఆదోని టౌన్: తండ్రి చంద్రబాబు అధికారంలో ఉంటే వరుణదేవుడు రాష్ట్ర ప్రజలను కరుణించడు. కరువు కాటకాలతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులపాలు చేయడం రాష్ట్ర ప్రజలకు అనుభవమే. ఆయన తనయుడు చిన్నబాబు యువగళం పాదయాత్ర వాన దేవుడికే ఇష్టం లేదని, అందుకే పట్టణంలో వడగళ్ల వాన కురిసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత విమర్శించారు. గురువారం తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. సాయంత్రం పట్టణంలో భారీ ఈదురుగాలులకు ఫ్లెక్సీలు చినిగిపోయాయి. వడగండ్ల వానతో పట్టణంలో పలు వీధుల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయన్నారు. వారి చర్యలకు ప్రకృతి కూడా సహకరించకపోవడాన్ని ప్రజలు గమనించాలన్నా రు. నారా లోకేష్‌లాంటి వారు ఎంతమంది వచ్చినా వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గెలుపును అడ్డుకోలేరన్నారు. ప్రజా ఆశీస్సులే జగనన్నకు అండగా ఉన్నాయని, ఎంతమంది వచ్చినా జగనన్నే మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు.

పది మందికి జైలు శిక్ష

- ఘర్షణ కేసులో ఆదోని కోర్టు తీర్పు

ఆదోని రూరల్ : రెండు వర్గాల ఘర్షణ కేసులో ఆదోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పది మందికి జైలు శిక్ష విధించారు. ఆదోని త్రీటౌన్ సీఐ శ్రీరామ్ తెలిపిన వివరాల మేరకు.. 2015 డిసెంబర్ 9న రాత్రి జనచైతన్య యాత్రలో భాగంగా ఆదోనికి వస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫ్లెక్సీలు కట్టే విషయంలో పట్టణంలోని అరుంజ్యోతినగర్‌కు చెందిన టీడీపీకి చెందిన రెండు వర్గాలు గొడవ పడడంతో పలువురికి రక్తగాయాలయ్యాయి. అప్పట్లో ఓ వర్గానికి చెందిన నలుగురు, మరో వర్గానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. అయితే కేసు పూర్వాపరాలను మెజిస్ట్రేట్ ఇరువర్గాలకు చెందిన వారికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చారు. శిక్ష పడినవారిలో సంజయ్, గోవిందు, శ్రీనివాసులు, పరిశప్ప, జగ్గుల నాగరాజు, చిన్నప్ప, జగ్గుల రామాంజనేయులు, వసంత, రామకృష్ణ, ఈరన్న ఉన్నారని సీఐ వివరించారు. కాగా ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆదోనికి చెందిన సంగీత, ఎమ్మిగనూరుకు చెందిన గొల్ల కృష్ణ వాదించారు.

విద్యుత్ తీగలు తగలి వరి గడ్డి దగ్ధం

కౌతాళం: మండలంలోని రౌడూరు గ్రామంలో గురువారం వరి గడ్డి తరలిస్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగలి అగ్నికి ఆహుతైంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రైతు ధర్మన్న పశువుల కోసం మేత కోసం కర్ణాటక నుంచి ట్రాక్టర్‌తో వరిగడ్డిని తీసుకొస్తుండగా గ్రామ సమీంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో నిప్పురవ్వలు రాలి మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టూ పక్కల పొలాల్లోని రైతులు కర్రల సహాయంతో ట్యాలీలోని వరిగడ్డిని తొలగించి మంటల్ని ఆర్పివేశారు. అయితే అప్పటికే గడ్డి కాలిపోయింది. ప్రమాదంలో రూ.20వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.



కాలిపోతున్న వరి గడ్డి ట్రాక్టర్

ఉరుకుందకు పోటెత్తిన భక్తులు



వెండి అలంకరణలో స్వామి వారు



క్షేత్ర పరిసరాల్లో భక్తుల రద్దీ



దర్గా ఆవరణలో దర్శనం నిమిత్తం వేచి ఉన భక్తులు

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం అమావాస్య సందర్భంగా గురువారం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం సాయంత్రం నుంచే తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారుజామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి అనుమతించారు. ప్రత్యేక దర్శనం క్యూలైన్ భక్తులకు కూడా దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. అధిక శాతం భక్తులు క్షేత్ర పరిసరాల్లో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు సమకూర్చారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, బళ్లారి డిపోల వారు ప్రత్యేక బస్సులను నడిపారు. అలాగే.. మేళిగనూరులో తుంగభద్ర నది ఒడ్డున వేలసిన రామలింగేశ్వర దేవాలయం గురువారం భక్తులతో పులకించింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సుళేకేరి గ్రామ శివారుల్లో వెలిసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి వారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉరుకుందకు వచ్చిన భక్తులు స్వామి దర్శనానికి రావడంతో ఆలయ పరిసరాలు నిండిపోయాయి.

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు

స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గురువారం స్వామి వారం కావడంతో పాటు అమావాస్య కలిసి రావడంతో భక్తులు తరలివచ్చారు. దీంతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. కొందరు భక్తులు పిండి వంటలు వండి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రంజాన్ మాసం కావడంతో భక్తులు దర్గా ఆవరణలో, దర్గా మజీద్‌లో ఇఫ్తార్‌లో పాల్గొని నమాజులు ఆచారించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు.

గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

ఆస్పరి: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతుగా తోడ్పాటు అందించాలని జిల్లా గ్రంథాలయాల చైర్మన్ సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. గురువారం ఆస్పరి గ్రంథాలయంలో గ్రంథాలయాల అభివృద్ధి, ప్రజల భాగస్వామ్యంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం ఉంటే గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రంథాలయాలను పాఠకులు, విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుద్యోగులు పోటీ పరీక్షల కోసం ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి నెలలో ఒక రోజు అన్ని గ్రంథాలయాల్లో జగనన్న స్వచ్ఛ గ్రంథాలయం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆస్పరి గ్రంథాలయానికి త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. అనంతరం లైబ్రరీ సభ్యత్వం తీసుకున్న వారికి చైర్మన్ రసీదులు అందజేశారు. కార్యక్రమంలో మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన్, హెచ్‌ఎం జ్యోతి మూర్తి, సొసైటీ సీఈఓ అశోక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెద్దయ్య, ఆలూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీం నాయుడు, వీఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, నాయకులు సుంకర రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, తిమ్మప్ప,ప్రకాష్ గౌడ్, గఫూర్,వీరేష్, కౌలుట్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

చలో ఢిల్లీ పోస్టర్లు విడుదల

ఆస్పరి: వాల్మీకి, బోయల ఎస్టీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మే 31న చేపటనున్న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను గురువారం వీఆర్‌పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, వీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన, సొసైటీ సీఈఓ అశోక్, నాయకులు రాంభీంనాయుడు, సుంకర రామాంజినేయులు, లక్ష్మీనారాయణ, పెద్దయ్య, తిమ్మప్ప, శివ, శివకోటి తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు డీడీఎంకు సత్కారం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సుదీర్ఘకాలం పని చేసి బదిలీ అయిన నాబార్డు డీడీఎం పార్థవకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం సభ్యులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన హైదరాబాద్‌లోని నాబార్డు రీజనల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో భువనేశ్వర్‌లో ఏజీఎంగా పనిచేస్తున్న సుబ్బారెడ్డిని డీడీఎంగా నియమించారు. బదిలీ అయిన డీడీఎం పార్థవను గురువారం సాయంత్రం డీసీసీబీ చైర్‌పర్సన్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో ఆమె చాంబరులో ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లాభాల బాట పట్టడంతో ఆయన పాత్ర ఎంతో ఉందని పేర్కొన్నారు. డీసీసీబీకి, జిల్లాకు ఆయన అందించిన సేవలను ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.రామాంజనేయులు కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజావిష్ణువర్ధన్ రెడ్డి, పాలకవర్గం సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, సీమ సుధాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మూలింటి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళుతున్న నాబార్డు డీడీఎం పార్థవను సత్కరిస్తున్న డీసీసీబీ పాలకవర్గం

పరామర్శ

మంత్రాలయం రూరల్: మండలంలోని మంచాల సొసైటీ సీఈఓ ఖాజా, పెద్దకడబూరు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన బాలయ్య అనారోగ్యంతో బాధపడుతూ కర్నూల్‌లోని వేర్వేరు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్ రెడ్డి గురువారం కర్నూల్‌కు వెళ్లి ఇద్దరినీ పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. మండల నాయకులు లక్ష్మీనారయణరెడ్డి, కాంతరెడ్డి ఉన్నారు.

జనం లేని యువగళం

ఆదోని రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదోని నియోజకవర్గంలో చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో జనం లేక వెలవెలబోయింది. పెద్దపెండేకల్ నుంచి గురువారం ఉదయం 7;30 గంటలకు పాదయాత్ర ప్రారంభమైంది. అసలు పాదయాత్ర నారా లోకేష్ ఎందుకు చేపట్టాడో దీనివల్ల ప్రజలకు ఏమి చెప్పాలనుకుంటున్నాడో కూడా సూటిగా చెప్పకుండా తడబడుతూ.. తనకు ఇష్టమొచ్చినట్లు హామీలు ఇస్తూ ముందుకెళ్తున్నాడు. దీంతో ప్రజలు నారా లోకేష్ తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే నారా లోకేష్ వెంట స్థానిక టీడీపీ నాయకులు విడివిడిగా పాదయాత్రలో స్వాగతం పలుకుతూ తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు.

కొనసాగుతున్న ప్రచార భేరీ

ఆదోని రూరల్ : మోదీని గద్దె దింపుదాం... దేశాన్ని రక్షించుకుందాం అని సీపీఐ, సీపీఎం చేపట్టిన ప్రచార భేరీ గురువారం మండలంలోని విరుపాపురం, కడితోట, జి.హొసళ్లి గ్రామాల్లో సాగిందిరు. సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, సీపీఐ మండల కార్యదర్శి బసాపురం గోపాల్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ కార్పొరేట్లకు ప్రజాధనాన్ని ధారాదత్తం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నరసప్ప, తిక్కప్ప, అంజిత్‌కుమార్ గౌడ్, తిక్కన్న, దావీద్, చిరంజీవి, భీమాంజనేయులు, వీరేష్ పాల్గొన్నారు.

సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా కృష్ణంరాజు



కౌతాళం: స్థానిక సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా దాట్ల కృష్ణంరాజు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేస్తారని సంఘం సీఈఓ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా ఉన్న నాగరాజ్‌గౌడ్ ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్‌గా ఎంపిక కావడంతో ఈ పదవి ఖాళీగా ఉంది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడిగా ఉన్న కృష్ణంరాజు ఎంపికకు ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మొగ్గు చూపారు. కాగా.. ఈయన గతంలో రెండుసార్లు సహకార సంఘం అధ్యక్షుడిగా, కౌతాళం సర్పంచ్, జెడ్పీటీసీ సభ్యుడిగా వ్యవహరించారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

ఆదోని రూరల్ : నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, పాలనతీరును గత ప్రభుత్వాలతో పోల్చి చూడాలని, మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కల్లుపోతుల సురేష్ గురువారం మండలంలోని మండిగిరిలోని ఎస్‌బీఐ కాలనీ-1, 2, శ్రీరామ్‌నగర్, శ్రీనివాసనగర్ కాలనీల్లో ఇంటింటికి తిరిగి మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమం చేపట్టారు. ప్రజల అభిప్రాయాలను నమోదు చేసుకన్నారు.రాజశేఖర్‌రెడ్డి, సురేష్, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

కోసిగి: స్థానిక ఊరువాకిలి సమీపంలోని నూరాణి సున్నీ మసీద్‌లో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి మసీద్‌కు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఎంపీపీ ఈరన్న, ఇల్లూరి ఆదినారాయణ, మాణిక్యరాజు, మహతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, బుల్లి నరసింహులు, మసీద్ పెద్దలు పాల్గొన్నారు.



ముస్లింలకు భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంటి అద్దాల పంపిణీ

కౌతాళం: మండలంలోని రౌడూరు గ్రామంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న 30 మందికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కళ్ల అద్దాలను అందజేశారని గ్రామ నాయకులు సామిరెడ్డి, పాండురంగారెడ్డి, మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఇటీవల గ్రామానికి చెందిన వారికి కర్నూల్‌లోని అమీలియో ఆసుపత్రిలో కంటి ఆపరేషన్లు చేయించారు. అందులో 30 మందికి కళ్ల అద్దాల అవసరమవడంతో వాటిని అందజేశారు. సుధకర్‌రెడ్డి, నర్సారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



అద్దాలు అందజేస్తున్న దృశ్యం

యువకుడి ఆత్మహత్య

తుగ్గలి : ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం ఎద్దులదొడ్డిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నారాయణ, రంగమ్మ దంపతుల రెండో కుమారుడు రాముడు(32) ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాముడుకు భోజనం తీసుకొచ్చిన బంధువు గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి చూశారు. తల్లిదండ్రులు బతుకు దెరువు నిమిత్తం గుంటూరుకు వలస వెళ్లగా ఇతను ఇంటి దగ్గరే ఉన్నాడు. ఇంకా పెళ్లి కాలేదు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

చిప్పగిరి: ఫీల్డ్ సర్వే లో గుర్తించిన వివిధ భూముల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సర్వేయర్లను, వీఆర్ఓ లను డిప్యూటీ తహసీల్దారు గుండాల నాయక్ ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్ఓలు, సర్వేయర్‌లకు భూముల రీ సర్వే పై సమావేశం నిర్వహించారు. వీఆర్ఓలు , సర్వేయర్లు పాల్గొన్నారు.